

ఎన్‌సిడి 4.0 సర్వే క్వాలిటీగా నిర్వహించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేన్సర్ స్క్రీనింగ్, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యాధికారులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడుతూ ఎన్‌సిడి 4.0 సర్వే ప్రతి పీహెచ్సీలో క్వాలిటీగా బలోపేతం చేయాలన్నారు. అర్బన్‌లో ఏఎన్ఎమ్‌లు, రూరల్‌లో ఏఏఎంలలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పిలు బాధ్యతగా ప్రతిరోజు 15 కేసులు చొప్పున వారానికి 75 కేసులు సర్వే క్వాలిటీగా జరపాలని, అందులో సస్పెక్ట్ కేసులు ఓరల్ కేన్సర్‌కి సంబంధించి డాక్టర్ వద్దకు రెఫరల్ చేయాలని తెలిపారు. అలాగే రూరల్‌లోని ఏఎన్ఎంలకు మరోసారి ఎన్సీడీపై శిక్షణ ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పిస్తూ ప్రతిరోజు సర్వేని క్వాలిటీగా నిర్వహించాలని అన్నారు. డాక్టర్ వెంకట ప్రసాద్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ గిరి, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనూష, వేణుగోపాల్, శ్రీవాణి, ప్రోగ్రాం అధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే!..

- నగరి సంతలో కంపు.. కంపు..
- పేరుకుపోయిన వ్యర్థాలు
- వానకు కుళ్లి దుర్వాసన
- పట్టించుకోని నిర్వాహకులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

నగరి పట్టణ నడిబొడ్డులో ఉన్న సంతమైదానం పారిశుధ్యం లోపం కారణంగా కంపు కొడుతోంది.. ఎక్కడ పడితే అక్కడ చెత్తచెదారం దర్శనమిస్తున్నాయి. పేరుకుపోయిన వ్యర్థాలు ఇటీవల కురిసన వానలకు కుళ్లి తీవ్రమైన దుర్వాసన వస్తోంది. సంతమైదానంలో బస్టాండు ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంతమైదానం నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు ముక్కు మూసుకుని వెళుత్తూ నానా తంటాలు పడుతున్నారు. పారిశుద్ధ్యం కార్మికులు, అధికారలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సంతమైదానంలో వదిలినిపెట్టిన కూరగాయలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వలన అవి కుళ్లిపోవడం వలన ఇంత దుర్వాసన వస్తోందని ప్రజలు, ప్రయాణికులు అంటున్నారు.

రూ.23 లక్షలు వసూళ్లు

ఈ ఏడాది సంతమైదానం ద్వారా వేలం పాటలో రూ.23లక్షలు మున్సిపాలిటికి ఆదాయం వచ్చింది. ప్రతి వారం శుక్రవారం ఇక్కడ సంత జరుగుతుంది. నాలుగు మండలం నుంచి వేలాది



మంది కూరగాయల కోసం ఇక్కడికి వస్తుంటారు. వందల సంఖ్యలో వ్యాపారస్తులు ఇక్కడికి వస్తూంటారు. వేలంపాట పాడిన నిర్వాహకులు ఒక్కో అంగడికి రూ.50 నుంచి 100 లు వసూళ్లు చేస్తుంటారు. ఇలా వారికి సుమారు రూ.50వేలు నుంచి లక్ష రూపాయల వరకు వసూళ్లు వస్తుంది. అయితే నిర్వహణ మాత్రం గాలికి వదిలేశారు. దీంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య కారణంగా ప్రజలు జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. బస్టాండు లోపల అడుగు వేయాలంటే ముక్కు ముసుకోవల్సి పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైన అధికారులు స్పందించి పారిశుధ్యచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సంత పరిసరాల్లోనే పేరుకుపోయిన చెత్తాచెదారం

ధర్మకర్తల మండలి సమావేశంలో పలు కార్యక్రమాలకు ఆమోదముద్ర

రూ.25 కోట్లతో అతిథిగృహం, కళ్యాణ మండపాలు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, ఎమ్మెల్యే, ఈవో

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణధికారి కార్యాలయం మీటింగ్ హాలులో సోమవారం మొదటి ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ అధ్యక్షత వహించారు. దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, దేవస్థానం ఈవో పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. మొదటిగా ధర్మకర్తలి సభ్యురాలు టీవీ రాజ్యలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు, ఆ తరువాత సభ్యులు, అధికారులు, సిబ్బందితో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. తొలి అంశం వేద పాఠశాలపై ప్రభుత్వానికి నివేదిక పంపుటకు ఆమోదం తెలిపారు. తరువాత ఇటీవల టీటీడీ రూ.25 కోట్లతో అతిథిగృహం, కళ్యాణ మండపాలు నిర్మాణంనకు ఆమోదం తెలిపారు. అలాగే పుష్కరిణి మార్పిడి టెండర్లు, వివిధ అంశాలపై చర్చించడం జరిగింది. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు నాయుడు, సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, నరేష్, పద్మలత, అనసూయ, వసంత, కృష్ణవేణి, రాజ్యలక్ష్మి, సునీత, చంద్రకళ, శ్రీవాణి, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ప్రసాద్, ధనంజయ, మాధవ రెడ్డి, ధనపాల్ పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల గుంపు దాడి

ప్రజలను, రైతులను అప్రమత్తం చేసిన అటవీ శాఖ అధికారులు


అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగు


ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ నెరుకూరివారిపల్లె సమీపంలో నాలుగు ఏనుగులు గుంపుగా రెండు రోజులుగా సంచరిస్తూ పంట పొలాలపై దాడులు చేస్తూ, కొబ్బరి చెట్లను విరిచి, వరి పంటను తిని తొక్కి ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోయారు. గ్రామం చుట్టూ అటవీ ప్రాంతం ఉండడంతో తరచూ ఏనుగులు పంటలపై పడి నష్టపరుస్తున్నాయని, ఏనుగుల సంచారం ఎక్కువ కావడంతో ప్రజలు, రైతులు భయాందోళనకు గురికావల్సి వస్తోందని, రాత్రివేళ పంట పొలాలపై దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం గ్రామస్తులు పంటపొలాల వద్దకు వెళ్లి చూడగా కొబ్బరి చెట్లు విడిరి, వరి పైరుపై నడుచుకుంటూ వెళ్లడంతో పైరు మొత్తం ధ్వంసం అయిందని ఇటీవల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన తమకు ఇప్పుడు ఏనుగులు వలన ఉన్న కాస్త పంటకూడా లేకుండా పోయిందని వాపోయారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ ఎఫ్‌బిఓ రాధ గ్రామానికి వెళ్లి ఏనుగుల దాడి వల్ల పంట నష్టపోయిన రైతుల వివరాలు తెలుసుకున్నారు. ఏనుగుల సంచారం పై ప్రజలను రైతులను అప్రమత్తం చేశారు. ఏనుగులు సంచరిస్తున్నట్లు తెలిసిన వెంటనే వాటిని బెదిరించకుండా ఉండాలని, మన వైపు నుండి వాటికి ఎలాంటి ఆపద లేదని తెలిసినప్పుడు మనుషులపై దాడి చేయవని తెలిపారు. పంట నష్టం జరిగిన వారికి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



ప్రజాశక్తి- పుంగనూరు: కరాటే వలన మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతాయని అలాగే ఆత్మరక్షణకి తోడ్పడతాయని కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేట్ ఛైర్మన్ రామాంజనేయులు అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్ ప్రెసిడెంట్ కోల ప్రతాప్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ షిటో రై కరాటే ఛాంపియన్ షిప్ -2025 పోటీలు ఆదివారం జరిగాయని తెలిపారు. ఈ పోటీలలో పుంగనూరుకి చెందిన మహేష్ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని మహేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కరాటే పోటీలలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిలాల నుండి కరాటే విద్యార్థులు కరాటే మాస్టర్లు కరాటే కోచ్‌లు పాల్గొన్నారు. కట, కుమితే విభాగాలలో అత్యధికంగా బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. పుంగనూరుకి చెందిన పివి.సహస్ర, జుహ ఫాతిమ, కే.పవిత్ర, కె.రీత్విక్, జి.కార్తికేయ, ఎం.తనీశ్వర కుమార్ రెడ్డి, బి.నవనీష్ రెడ్డిలు బంగారు పథకాలు సాధించారు. అలాగే వై.మోహిత్, టి.జ్ఞానవికాస్, టి.దేవాన్ష్‌లు వెండి పథకాలు సాధించారు. ఏ.హిష్ణు, వి.జీవన్ కుమార్ కాంస్య పథకాలు గెలుసుకోవడం జరిగింది. బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ.రాజారెడ్డి, బనగానపల్లె సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొని టోర్నమెంట్ మెయిన్ రీఫ్రీగా వ్యవహరించిన కరాటే మాస్టర్ రెడ్డి మహేష్‌ను ఘనంగా సత్కరించి మెమెంట్ అందించినట్లు తెలిపారు.

'ఆర్‌బికె'లు ఎప్పుడు తెరుస్తారు సార్...



తాళం వేసి ఉన్న ఆర్‌బికె

ప్రజాశక్తి- విజయపురం: రైతులకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గర చేయాలనే ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల పంపిణీతోపాటు పంట నమోదు, కొనుగోలు ప్రక్రియలన్నీ వీటి ద్వారా నిర్వహించాలని భావించింది. అంతేకాకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయంలో ప్రతి సోమవారం గ్రీన్ వెన్స్ డేగా ప్రభుత్వం నిర్వహించింది. అయినా కూడా విజయపురం మండలం హెడ్ కోటర్స్‌లోని రైతు సేవా కేంద్రం మాత్రం మూత పడి ఉందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎప్పుడు ఫోన్ చేసిన సర్వేలో ఉన్నామని చెబుతున్నారని, అందరూ సర్వేలు చేస్తుంటే రైతులకు ఎప్పుడు అందుబాటులో వస్తారని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. విజయపురం మండలంలో ఉన్న ఆర్‌బీకేలు ఎప్పుడు చూసిన మూసివేసి ఉండడంతో రైతులు కార్యాలయానికి వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారని, ఎప్పుడు తెరచి ఉంటుందో కూడా తెలియక ప్రతి రోజులు ఇబ్బందులు పడుతున్నామని స్థానిక రైతులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో రైతులు విత్తనం కోసం కార్యాలయం చుట్టు తిరుగుతున్నామని, అయితే అక్కడ కార్యాలయం మూసి ఉండడంతో రైతులు రోజు వచ్చి తిరిగి వెళ్లిపోతున్నామని చెబుతున్నారు. ఒక వేళ తెరిచి ఉన్నా అధికారులు ఉండడం లేదని, ఇప్పటికైన జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి : కలెక్టర్

పిజిఆర్‌ఎస్‌కు 370 వినతులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

పిజిఆర్‌ఎస్ అర్జీలను నాణ్యతగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఓ మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కరుణ కుమారి, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారవేదిక అర్జీలకు సంబంధించిన ఆడిట్‌ను జిల్లా అధికారులు ప్రాధాన్యతగా పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మొత్తంగా 370 అర్జీలను అందాయి. ఇందులో శాఖల వారీగా రెవెన్యూ, సర్వే డిపార్ట్మెంట్ 226, పంచాయతీరాజ్ శాఖ 2, పోలీస్ శాఖ 14, డ్వామా పీడీ 6, విద్యాశాఖ 6, డిపిఓ 6, వైద్య ఆరోగ్యశాఖ 8, అగ్రికల్చరల్ 4, డిఆర్డిఏ పీడీ 58, సివిల్ సప్లై 2, విద్యుత్ శాఖ 2, సర్వశిక్షణ అభియాన్ 4, అనిమల్ హస్బండ్రీ 3, హౌసింగ్ 6, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 2, వాటర్ రిసోర్సెస్ 2, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 2, ఐసిడిఎస్ 2, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ 3, సిపిఓ 4, రోడ్లు, భవనాల శాఖ 2, డిసిసి బ్యాంక్ 2, ఇరిగేషన్ 1, డిసేబుల్ వెల్ఫేర్ 1, మైండ్స్ అండ్ జువాలజీ 2.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సమస్యలను అలసత్వం చేయకండి : ఎస్పీ

చిత్తూరు అర్బన్: ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి తుషార్ డూడి ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పనిచేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఎస్‌పి, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, అడ్మిన్ ఇంచార్జ్ ఎస్ఆర్.రాజశేఖరరాజు, చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ టి.సాయినాథ్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యమని ఎస్‌పి తెలిపారు. ఫిర్యాదులపై తక్షణ చర్య తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు.మొత్తం 46 ఫిర్యాదులు అందాయి, చీటింగ్ 3, కుటుంబ తగాదాలు 4, వేధింపులు 3, భూ తగాదాలు 7, ఇంటి తగాదాలు 2, ప్రేమ వివాహం 1, డబ్బు తగాదాలు 8, చిన్న గొడవలు 6, పోలీస్ సేవలు 5, ఆస్తి తగాదాలు 7 ఉన్నాయి.


అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ తుషార్ డూడి

వేగంగా పీజీఆర్‌ఎస్ వినతుల పరిష్కారం

చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో అందే వినతులను వేగంగా పరిష్కరించాలని సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజాసమస్యలను సావధానంగా విని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజలు అందించిన వినుతులపై క్షేత్రస్థాయిలో పరిశీలనచేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం 3, ప్రజారాజ్య విభాగం 2, మెప్మా 2, టిడ్కో గృహాలు 1, టైన్ ప్లానింగ్ 1 చొప్పున మొత్తం 9 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ ఎంహెచ్ఓ డాక్టర్ పి.లోకేష్, ఏఈ వెంకటరామిరెడ్డి, ఆర్వో గోపాలకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

అర్హులకే పింఛన్... దళారులను నమ్మకండి..

వికలాంగులకు జిల్లా కలెక్టర్ భరోసా

చిత్తూరు మండలం రూరల్ పరిధిలోని తలంబేడు గిరిజన కాలనీలో ఉంటున్న కె.గోపాల్ కలెక్టరేట్‌కు వచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు. తనకు 95శాతం వికలత్వం ఉందని, అయినా రూ.6వేలు పింఛన్ ఇస్తున్నారని, తాను నడవలేని స్థితి లో ఉన్నానని, వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యశాఖ అధికారి, డిఆర్‌డిఏ పీడీని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఐరాల మండలం, చిన్నకంపల్లి గ్రామపరిధిలో కొండ్రంపల్లి గ్రామం 9 మంది వికలాంగులు తమకు 19 నెలలోగా తమకు పింఛన్ అందలేదని, సదరం సర్టిఫికెట్ కొరకు సచివాలయం చుట్టూ తిరుగుతన్నా తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని గ్రామ సచివాలయ సిబ్బంది చెబుతున్నారని, తమకు వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. వీటిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇకపై అర్హులకు మాత్రమే అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఆరు దశలలో పరిశీలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, సదరం ధృవపత్రాలు వైద్యబృందాలు తనిఖీ చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఇంకా 5200 మంది వికలాంగులు పెన్షన్ల కొరకు దరఖాస్తులు సమర్పించి ఉన్నారని త్వరలో వికలాంగుల పరికరాల కొరకు అందజేయడానికి రూ.6.50 కోట్లు విలువ గల పరికరాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతినెలా దివ్యాంగులకు సుమారు రూ.21 కోట్లు పెన్షన్ అందజేస్తున్నామని అర్హత కలిగిన ఒక్కొక్క వికలాంగుడికి రూ.6వేలు, రూ.10వేలు, రూ.15వేలు చొప్పున జిల్లాల మొత్తం 34,538 మంది దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా అందజేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.



అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా రీ ఓపెన్‌కి ఆస్కారం లేకుండా నాణ్యతతో పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, రెవెన్యూ డివిజన్, అధికారులు, మునిసిపల్ కమీషనర్లు, తహసిల్దార్లు, మండల అధికారులతో వర్చువల్‌గా ప్రజాసమస్యల పరిష్కార వేదిక అర్జీలు పరిష్కారంపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డిఆర్‌ఓ మోహన్ కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, కరుణ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలను నాణ్యతతో గడువులోగా పరిష్కారం చూపాలని, ఎలాంటి అలసత్వం ఉండరాదని తెలిపారు. పరిష్కారం చూపలేని అర్జీదారునికి స్పష్టంగా ఎండార్స్మెంట్ చేసి తెలపాలని, రీ ఓపెన్‌కి తావు లేకుండా పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారులు వారి సమస్యల పరిష్కారం కొరకు పీజీఆర్‌ఎస్‌కు రావడం జరుగుతుందని సంబంధిత అధికారులు అర్జీదారునితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను సావధానంగా విని సంతృప్తస్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్లకుండా రోజు వారీగా అర్జీలను ఓపెన్ చేసి చూసుకుని పరిష్కారదిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిజిఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సంబంధిత శాఖాధికారులను కలెక్టర్ హెచ్చరించారు. కోర్టు కేసులకు వెంటనే కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని, రెవెన్యూ, రీ సర్వే, పోలీసు శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అధిక సంఖ్యలో వినతలు అందజేశారని తెలిపారు. పిజిఆర్‌ఎస్‌కు వచ్చిన వినితులను ఫ్రీ ఆడిట్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఓ రవికుమార్ పాల్గొన్నారు.

శరవేగంగా 'నాన్న డైరీ' చిత్ర నిర్మాణం



ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు నియోజక వర్గంలోని సదుం మండలం, పీలేరు పరిసరాల్లో "నాన్న డైరీ" చిత్ర నిర్మాణం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. పివిఆర్ సినీక్రియేషన్స్ బ్యానర్లో నిర్మాత కోటి పాలకుంట చిత్రనిర్మాణాన్ని చేపట్టారు. సోమవారం మీడియాతో నిర్మాత మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబ జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని, ఓ తండ్రీ కొడుకుల ఎమోషనల్ సెంటిమెంట్స్‌తో "నాన్న డైరీ" టైటిల్‌కు ప్రతి పేజీ వెనక ఓ కన్నీటిగాథ సబ్ టైటిల్‌గా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. గత నెల 17వ తేదీ నుంచి సదుం, పీలేరు మండలాల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో చిత్రం రెగ్యులర్ షూటింగ్ చేస్తున్నట్లు తెలిపారు. పీలేరు ప్రాంత కళాకారులను ప్రోత్సహిస్తూ ఈచిత్రంలో నటించేందుకు అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. ఈ చిత్రానికి ఆనంద్ తంగేళ్ల కథ, మాటలు సమకూర్చగా స్క్రీన్ ప్లే, దర్శకత్వం బాధ్యతలను సురేష్ గండికోట, సహదర్శకుడిగా సుహేల్, అసోసియేట్‌గా బన్నీ, కెమెరా, ఎడిటింగ్ ఎఆర్.రాఖి అందిస్తున్నారన్నారు. ఈ చిత్రం ప్రధాన పాత్రలో 'ఆల్ ది బెస్ట్' ఖాదర్, చాను, ఇతర పాత్రల్లో బాబ్జాన్, అమ్ములు, తరిగొండ రాధాకృష్ణ నటిస్తున్నారు.

శ్మశాన వాటికకు భూమి కేటాయింపు


గ్రామస్తులకు పట్టాను అందిస్తున్న టిడిపి మండల అధ్యక్షులు రాజగోపాల్

ప్రజాశక్తి -కుప్పం : కుప్పం మండలం వానగుట్టపల్లి పంచాయతీ జంపనూరు గ్రామంలో శ్మశాన వాటికకు 50 సెంట్ల స్థలమును కేటాయించడం జరిగింది. శ్మశాన వాటికకు స్థలం లేదంటూ గ్రామస్తులు ఎమ్మెల్సీ కంచర శ్రీకాంత్ దృష్టికి తీసుకురాగా 50 సెంట్లు ప్రభుత్వ భూమి కేటాయించడం జరిగింది. సోమవారం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్ గ్రామస్తులకు 50సెంట్లు భూమికి సంబంధించిన పట్టాను అందజేశారు. శ్మశాన వాటికకు స్థలం కేటాయించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి రామచంద్ర, యూనిట్ ఇంచార్జ్ శివకుమార్, బూత్ ఇంచార్జి ఆక్మల్, కార్యదర్శి రమ్య లక్ష్మి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు రిజ్వాన్ పాల్గొన్నారు.

ఇంటింటికీ డస్ట్ బిన్లు పంపిణీ

ప్రజాశక్తి -కుప్పం: స్వచ్ఛ కుప్పం.. స్వర్ణ కుప్పం కార్యక్రమంలో భాగంగా కుప్పం మండలం వానగుట్టపల్లి పంచాయతీ పరిధిలో టిడిపి శ్రేణులు ఇంటింటికి డస్ట్ బిన్లను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాలు సైతం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. ప్రతి పంచాయతీకి ఇటీవల చెత్త సేకరణ కోసం ఎలక్ట్రిక్ సైకిల్‌ను అందజేయడం జరిగిందని అయితే ఇళ్లలోని చెత్తను బయటపడకుండా డస్ట్ బిన్లలో వేసి చెత్త సేకరణకు వచ్చేవారికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. యూనిట్ ఇంచార్జ్ శివకుమార్, సర్పంచ్ పార్వతి రాంచంద్ర, గోపాల్ గౌడు, రవి, బూత్ ఇంచార్జి అక్మల్, పంచాయితీ పార్టీ అధ్యక్షులు రిజ్వాన్, షరీఫ్, సాహిద్, శ్రీనివాసులు పాఠశాల చైర్మన్, పళని, కుప్పేంద్ర, పంచాయతీ కార్యదర్శి శివప్ప, రమ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భువనేశ్వరి పాల్గొన్నారు.

'మేనేజిమెంట్ థాట్స్'పై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ బి శంభు లింగప్ప

ప్రజాశక్తి -గుడుపల్లి: ద్రావిడ విశ్వ విద్యాలయంలోని కామర్స్ అండ్ మేనేజిమెంట్ విభాగంలో 'మేనేజిమెంట్ థాట్స్'పై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చి అవగాహన కల్పించారు. విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ గుల్బర్గా మేనేజ్ మెంట్ స్టడీస్ శాఖలో పని చేస్తున్న డాక్టర్ బి శంభు లింగప్ప ద్రావిడ విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ మేనేజిమెంట్‌లోని ఎంబిఏ విద్యార్థులకు 'మేనేజిమెంట్ థాట్స్' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం ఆయన విద్యార్థు లతో ముచ్చటిస్తూ విద్యార్థుల్లో నెలకొన్న పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ ప్రత్యేక ఉపన్యాసంలో శాఖ అధ్యక్షులు, డీన్ ఆచార్య ఎంసికేశవమూర్తి, అకడమిక్ అధ్యాపకులు డాక్టర్ సురేశ్, డాక్టర్ సూర్య ప్రకాష్, దీపిక, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ కుంభాభిషేక వేడుకల్లో ఎమ్మెల్యే


ఆలయ కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగర పరిధిలో పూనేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ దేవస్థానం మహా కుంభాభిషేక వేడుకల్లో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఉత్సవాలకు విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మహా కుంభాభిషేకం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన హోమం, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, నాయకులు ఎల్బీఐ లోకేష్, నళిని, తిరుకుమరన్, నవీన్ కుమార్, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.


పశువులకు , దూడలకు మందు పిచికారీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం మండలం మేలుమాయి పంచాయతీలో సోమవారం మదర్ థెరిసా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో పశువైద్యాధికారిణి శ్రీవాణి సహకారంతో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించినట్లు ప్రోగ్రామ్ ఆఫీసర్ దేవేందర్ రెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 200 పశువులకు, దూడలకు నత్తలమందు, దోమల నివారణ మందులు స్ప్రే చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.


సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్నటిడిపి నాయకులు


ప్రజాశక్తి- కుప్పం: కుప్పం టిడిపి కార్యాలయం వద్ద విభిన్న ప్రతిభా వంతులు సీఎం చంద్రబాబు చిత్ర పటానికి సోమ వారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం అధ్యక్షుడు మురళీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విభిన్న ప్రతిభావంతులకు డిసెంబర్ మూడవ తేదీ కురిపించిన వరాలు విభిన్న ప్రతిభావంతులకు చాలా ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో వికలాంగులకు పెద్దపీట వేసి వారికి ఏడు వరాలు కల్పించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి -పుంగనూరు: విద్యా ర్థులలో సహకార గుణాన్ని పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలు, లక్ష్యాలు స్పష్టంగా తెలిపేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని ఎంఈఓ నటరాజ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని టీచ్ టూల్ అబ్జర్వర్ లకు రెండు రోజుల శిక్షణ బసవరాజ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంసిద్ధత, బోధనా సమయం, తరగతి గది , సాంస్కృతి సహాయక అభ్యాస వాతావరణం, పాఠ్యాంశ నిర్వహణ, అవగాహన స్థాయి గుర్తించడానికి తరగతి గదిలో ఎలాంటి కృత్యాలు ఇవ్వాలో శిక్షణలో తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. తరగతి గది పరిశీలనలో విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి ప్రత్యేకమైన యాప్ లో నమోదు చేయడానికి శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కోర్సు డైరెక్టర్ ఎంఈఓ -2 రెడ్డన్న శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్స్ నారాయణస్వామి, గంగాధర్ హాజరై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహేష్ నారాయణ, ఇంద్రాణి, బాలసుబ్రహ్మణ్యం, రెడ్డమ్మ, రియాజ్ ఉన్నిసా, మాధురి, టీచ్ టూల్ అబ్జర్వర్ ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ప్లేట్లు, గ్లాసులు, కుర్చీలు వితరణ


ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి -యాదమరి: తెల్లరాళ్ళపల్లె ప్రాథమి కోన్నత పాఠశాలఉపాధ్యాయుడు పి సోమశేఖర్ తన తల్లి జన్మదినం సందర్భంగా బడిలోని 50 మంది విద్యార్థులకు భోజనం తినే ప్లేట్లు, గ్లాసులు , స్కూల్‌కి రెండు కుర్చీలు వితరణగా ఇచ్చారు. వీటి విలువ 7,500 రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది మార్చి 12 తేది ఒకే రోజు సోమశేఖర్ తల్లిదండ్రులు ఎన్ కళావతి, పిజి జయచంద్ర మృతి చెందారు. వారి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈవోలు టి రుక్మణమ్మ, హెచ్ఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఆయనకు సహోపాధ్యాయులు శైలజ, గౌతమి, క్లస్టర్ హెచ్‌యంఎపిలలిత, సంఘ నాయకులు కనకాచారి, భాస్కర రెడ్డి సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

ఘనంగా మార్వాడీల మాతాజీ ఉత్సవాలు

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఉన్న మార్వాడీల ఆలయ మాతాజీ దేవాలయంలో సోమవారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మార్వాడీ సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా విడతలవారీగా ఆయా ఆలయాల్లో నిర్వహిస్తున్నట్లు సంఘ సభ్యుడు రమేశ్ తెలిపారు. సమాజ ఐక్యత, సాంప్రదాయాల పరిరక్షణ కోసం ఇలాంటి ఉత్సవాలు ప్రతి ఏడాది విశేషంగా జరుగుతున్నాయన్నారు.

యూరియా కోసం క్యూ..

రైతు సేవా కేంద్రాల వద్ద రైతుల నిరీక్షణ


యూరియా కోసం బారులు తీరిన రైతులు

ప్రజాశక్తి -సోమల(సదుం): సదుం మండలం నడిగడ్డ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ వారు యూరియా పంపిణీ చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న అనేక మంది రైతులు రైతు సేవా కేంద్రం వద్దకు చేరుకుని బారులు తీరారు. దీంతో రైతులతో రైతు సేవ కేంద్రం కిక్కిరిసింది. నడిగడ్డ, చెరుకు వారి పల్లి, జోగి వారి పల్లి, సదుం పంచాయతీలకు చెందిన రైతులు ఒకసారిగా రైతు సేవ కేంద్రం వద్దకు యూరియా కోసం రావడంతో బారులు తీరి క్యూ లో నిలబడి తమ వంతు వచ్చే సమయానికి యూరియా దొరుకు తుందో లేదో నని ఆందోళ నకు గుర య్యారు. ఆయా పంచా యతీ పరిధి లోని రైతు సేవా కేంద్రాల వద్ద ఆయా పంచాయతీ పరిధిలోని రైతులకు యూరియా పంపిణీ చేసి వుంటే ఇంత రద్దీ ఏర్పడేది కాదని రైతులు అనుకోవడం కనిపించింది. రైతు లందరికీ యూరియా అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి



ప్రజాశక్తి -వికోట : మండల కేంద్రమైన వికోటలోని ముదిమడుగుకు చెందిన తిమ్మప్ప కుమార్తె అనుశ్రీ (14) తమ నివాసం ఉంటున్న ఇంటిలో అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ముదిమడుగు చెందిన తిమ్మప్ప కుమార్తె అనుశ్రీ స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నట్లు వారు తెలిపారు. ఇంటిలో కుటుంబ సభ్యులు లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు, స్థానిక పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరుకు తరలించారు. విద్యార్థిని మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. బాలిక మృతి పట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సోమశేఖర్ రెడ్డి తెలిపారు.


మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి సి వనిత

మహిళా సాధికారతపై అవగాహన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉమన్ ఎంపవర్‌మెంటు సెల్ ఆధ్వర్యంలో వ్యవసాయ రంగంలో మహిళా సాధికారత అనే అంశంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాలైన మండల వ్యవసాయ అధికారి సి వనితా వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర ఎంత ముఖ్యమైందో వివరించారు. ఆమె మాట్లాడుతూ 'మహిళలు వ్యవసాయ రంగ అభివృద్ధికి మార్గదర్శకులవుతున్నారు. వారి సాధికారత ద్వారా గ్రామీణ అభివృద్ధి సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యమ్రం విద్యార్థుల్లో వ్యవసాయ రంగంపై అవగాహన పెంచడమే కాక, మహిళల సామర్థ్యం పట్ల గౌరవాన్ని కలిగించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి అన్నపూర్ణ, శారద, కళాశాల ఉమన్ ఎంపర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ రుష్మ, ఐక్యు ఏసి కోఆర్డినేటర్ పి వెంకటేశు, డాక్టర్ వి ప్రభాకర్ రావు, డాక్టర్ సి అరుణ, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, సచివాలయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనారోగ్యంతో విశ్రాంత ఉద్యోగి మృతి


బండి ఈశ్వర్ రెడ్డి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని కాపు మొండి వెండినపల్లె గ్రామానికి చెందిన ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగి బండి ఈశ్వర్ రెడ్డి (65) సోమవారం మృతి చెందారు. అనారోగ్యంతో తిరుపతి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతునికి భార్యాపిల్లలు ఉన్నారు. సహ ఉద్యోగులు, నాయకులు గ్రామానికి వెళ్లి ఈశ్వర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

డీకే బద్రీనారాయణకు ఘన నివాళి


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్ మోహన్


ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: టిడిపి ఉమ్మడి జిల్లాల మాజీ ఉపాధ్యక్షు డు, ప్రముఖ పారిశ్రామి కవేత్త డీకే బద్రీ నారాయణ మృత దేహానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఘన నివాళి అర్పించారు. సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే, టిడిపి నాయకులతో కలిసి బివి రెడ్డి కాలనీలోని వారి నివాసానికి వెళ్లి డికె బద్రీ నారాయణ భౌతిక దేహానికి ఘన నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబం సభ్యులను పరామర్శించారు. స్థానిక లక్ష్మీ నగర్ కాలనీ లోని డీకే బద్రీ నారాయణ నివాసం నుండి ఇరువారం బాల త్రిపుర సుందరి కళ్యాణ మండపం వరకు భౌతిక దేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత


సిఎం సహాయ నిధిని అందిస్తున్న నాయకులు


ప్రజాశక్తి- రామకుప్పం: మండల పరిధి లోని మిట్టపల్లి గ్రామానికి చెందిన శాంతమ్మకు టిడిపి నేతలు సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో 50,940 వేల రూపాయలు చెక్కును అందించారు. అనారోగ్యంతో బాధలు పడుతున్న వారికి సిఎంఆర్ఎఫ్ ఆపన్న హస్తం అందించి ఆదుకుంటోందని, ఈ ఘనత సిఎం చంద్రబాబు కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, కడ సభ్యుడు రఘు, బాలు, నాగరాజు పాల్గొన్నారు.

21న పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం



ప్రజాశక్తి -సోమల: ఈనెల 21వ తేదీ ఆదివారం మండలంలో నిర్వహించే పల్స్ పోలియో కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య సిబ్బందిని ఆశా కార్యకర్తలను, అంగన్‌వాడీ కార్యకర్తలను వైద్యాధికారులు కోరారు. మండల కేంద్రమైన సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సిహెచ్‌ఓ అమర్నాథ్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు వయసు కలిగిన పిల్లలకు పోలియో చుక్కలు అందించాలని సూచించారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని కోరారు.

ఎస్ఎంసి చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -రామకుప్పం: మండలంలోని ఉన్సిగానిపల్లి గ్రామానికి చెందిన కేవిబి పాఠశాల ఎస్ఎంసి చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి మృతికి సోమవారం రాష్ట్ర ఆర్టీసీ వైస్ జీచైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మి ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరారు. టిడిపి వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నివాళులు అర్పించిన వారిలో రాష్ట్ర నేతలు గోపీనాథ్, నారాయణ చారి, యూనిట్ ఇన్‌ఛార్జ్ రామ్మూర్తి, మాజీ సర్పంచులు శ్రీనివాసులు రెడ్డి, జయశంకర్, మనేష్ ,బీరప్ప, కేశవులు, గోపి, మంజునాథ చారి, శీనప్ప ఉన్నారు.

స్కేటింగ్‌లో అంధునికి పురస్కారం


స్కేటింగ్ నిర్వహిస్తున్న అంధ విద్యార్థి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అంధ విద్యార్థికి పురస్కారం లభించిందని శాప్ ఛైర్మన్ అమ్మినేని రవి నాయుడు అన్నారు. సోమవారం స్కేటింగ్‌లో మురారి హర్షవర్ధన్ (11) అంధవిద్యార్థి కర్ణాటక న గిలినుండి పుత్తూరుకు స్కేటింగ్‌ను ప్రారంభించారు. ఈ స్కేటింగ్ కు గిన్నిస్ రికార్డును సొంతం చేసుకోవాలని ఉద్దేశంతో ప్రారంభించారని ఇతనికి సహకరించిన కోచ్‌లు ప్రతాప్, ప్రేమనాథ్ లను అభినందించారు. వీరికి అత్యంత భద్రత కల్పించి పోలీసులు 108 సహకారం అందించారు. యాత్ర 9వ తేదీ పుత్తూరుకు చేరుకున్న అనంతరం తిరుపతిలో అవార్డును ప్రదానం చేయనున్నట్టు ఆయన తెలిపారు.

వైసిపి హయంలోనే గ్రామాల అభివృద్ధి

-రూ. కోటి 48 లక్షలతో దళితవాడలో అభివృద్ధి పనులు


డ్రైనేజీల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి -కార్వేటినగరం: వైసిపి ప్రభుత్వం హయాంలోనే గ్రామాల అభివృద్ధి పనులు పరుగులు తీసిందని మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. కార్వేటినగరం పెద్ద దళితవాడలో రూ.3లక్షలు పంచాయతీ నిధులతో డ్రైనేజీ నిర్మాణానికి ఉప సర్పంచ్ శాంతి ఆధ్వర్యంలో సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో కార్వేటినగరం పెద్ద దళితవాడలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇందులో భాగంగా ఎన్ఆర్ఇజీఎస్ నిధులు రూ.70 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం చేపట్టా మన్నారు. తుడా నిధులతో గ్రామంలో కమ్యూనిటీ హాట్ నిర్మాణం, రూ.30 లక్షలతో గ్రామానికి సురక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపట్టామన్నారు. 15 ఫైనాన్స్ నిధులతో దళితవాడలో మిగిలిన డ్రైనేజీ కాలువలు నిర్మించేందుకు సోమవారం భూమి పూజ చేశామన్నారు. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా వైసీపీ ప్రభుత్వంలో దళితవాడల్లో అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకుడు శేషాద్రి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతిలో తీర్చిదిద్దాలి

తరగతి గది నిర్మాణంపై శిక్షణలో ఎంఈవో నాగేశ్వరరావు


తరగతి గదుల నిర్మాణంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: తరగతి గదులను అధునాతన పద్ధతిలో తీర్చి దిద్దాలని ఎంఈవో నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతి గది నిర్మాణంపై సోమవారం శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాల గదిని అధునాతన పద్ధతిలో తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు విద్యాబోధన చేపట్టేందుకు అవసరమైన వసతులు పరిశీలించుకోవాలని, తరగతి గదిఎంత గొప్పగా ఉంటే విద్యార్థి అంత గొప్ప వంతుడుగా తయారవుతాడన్నారు. ఈ శిక్షణ నేర్చుకున్న తర్వాత క్షేత్రస్థాయిలో అవలంబించా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 రమేష్ బాబు, ప్రధానో పాధ్యాయులు గిరిరాజు, చంద్రిక, లక్ష్మీపతి ,మోహన్ రెడ్డి శిక్షకులు బాబు ,బాలాజీ సీఆర్పీలు సుశీల, ప్రేమలత, సతీష్, పలువురు ఉపాధ్యాయిని ఉపాధ్యా యు లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలు

ప్రజల్లో హర్షం


గ్రామాల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవ పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డి గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. కుప్పం కేన్సస్‌కు చెందిన డాక్టర్ మధు నేతృత్వంలోని వైద్య బృందం, ల్యాబ్ టెక్నికల్ అసిస్టెంట్ ఝాన్సీ సహకారంతో గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలను అందించింది. శిబిరంలో మొత్తం 72 మంది వైద్య సేవలు పొందగా, వారిలో 24 మందికి హైబీపీ సమస్యను గుర్తించిన వైద్యులు తక్షణమే అవసరమైన మందులు అందించారు. వచ్చే నెలలో అదే గ్రామంలో మళ్లీ నిర్వహించే శిబిరానికి హాజరై కొనసాగింపు చికిత్సలు పొందవచ్చని డాక్టర్ మధు గ్రామస్తులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముంతాజ్ అమీర్ బాష మాట్లాడుతూ, 'మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు ఆశయాలను నెరవేర్చేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ గ్రామాలకు చేరుకుని అమూల్యమైన సేవలు అందించడం ప్రజలకు పెద్ద ఆశీర్వాదం' అని అభినందించారు. గ్రామ ప్రజలు వైద్య బృందంపై సంతృప్తి వ్యక్తం చేశారు. 'తమ గ్రామానికి వచ్చి ఇలాంటి సేవలు అందిస్తున్నందుకు డాక్టర్ మధుకి, బృందానికి హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలిపారు. గ్రామస్తుల ఆరోగ్యంపై ఇంత శ్రద్ధ చూపడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధు, ల్యాబ్ టెక్నీషియన్ ఝాన్సీ, స్టాఫ్ సభ్యులు ప్రశాంతి, పైలెట్ బాలగంగాధర్, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీచ్ టూల్ పై అవగాహన

ప్రజాశక్తి- రొంపిచెర్ల :'టీచ్ టూల్ పై ఉపాధ్యాయులకు జిల్లా పరిశీలకులు సోమవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో ముని చంద్ర, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచ్ టూల్ పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల తరగతి గదులలో ఉపాధ్యాయుల బోధనను పరిశీలించడం వల్ల విద్యార్థుల లో విద్యా ప్రమాణాలను పెంచవచ్చునని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఆర్పీ ప్రధానోపాధ్యాయులు అమర్ శేఖర్, ధనలక్ష్మి చిన్నయ్య, ఏపీ ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డి ప్రదీప్, మాస్టర్ ట్రైనీలు కృష్ణవేణి,రాజేంద్ర, పరిశీలకులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలోనూ మౌలిక వసతులు

రూ.5.16 కోట్లతో సిసి రోడ్ నిర్మాణం



ప్రజాశక్తి -కుప్పం: కుప్పం నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడంతోపాటు రోడ్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీ 22 వార్డు గుడిపల్లి రోడ్డు సర్కిల్ వద్ద నుండి పెద్దపర్తి కుంట వరకు రూ.5.16 కోట్లతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్ పండ్లను సోమవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పికేయం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్ పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రణాళిక బద్ధంగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోపాటు రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు ఇకపై పరుగులు తీయనుందని ప్రజలకు అవసరమైన అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతులు రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్ల మరమ్మత్తులు నూతన రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే కుప్పం నియోజకవర్గ రూపురేఖలు మారనుందని అభివృద్ధికి ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెస్కో చైర్మన్ ప్రతాప్,కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్,కౌన్సిలర్లు జిమ్ దాము,సురేష్,సోమశేఖర్, విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్, రెస్కో డైరెక్టర్లు ఆర్ముగం, శివ, అమీర్, యువనేత హర్ష, యూత్ అధ్యక్షుడు ప్రశాంత్,మునెప్ప నరేష్,పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వాహనంతో సహా ఎర్రచందనం స్వాధీనం


ఫారెస్టు అధికారులు స్వాధీనం చేస్తున్న ఎర్రచందనం దుంగలు

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలం రెడ్డివారిపల్లె వద్ద సోమవారం ఉదయం నాలుగు గంటల సమయంలో పీలేరు, డివిజనల్ అటవీ శాఖ అధికారి, సంచార దళ్ నిఘా విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిఘా ఏర్పాటు చేశారు. తెల్ల రంగు టాటా ఇండిగో మాంజా కారు నెంబర్ ఏపీ 03 ఏ డబ్ల్యు 1134 నెంబరు కారు రొంపిచెర్ల వైపు వేగంగా పోతుండడం గుర్తించిన, నిఘా విభాగం అధికారులు కారును నిలిపే ప్రయత్నం చేయగా కారు డ్రైవర్ మరింత స్పీడుగా వెళ్లి, మంగళంపేట వైపు స్పీడ్ గా వెళ్లే ప్రయత్నం చేయగా అటవీ శాఖ నిఘా అధికారులు తమ వాహనాలతో వెళ్లి అనుమానాస్పద కారును ఆపేందుకు యత్నించారు. అందులోని కారు డ్రైవరు దూకి పారిపోయినట్లు పీలేరు, డివిజన్ అటవీ శాఖ అధికారి, సంచార దళ్ విభాగం ఎస్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. కారులో ఆరు ఎర్రచందనం దుంగలు ఉన్నాయని వాటి బరువు 87 కేజీలు, వాటి విలువ రూ. 3,69,489 లు ఉంటుందని ఆయన తెలిపారు. పట్టుబడిన కారు విలువ రూ రూ.1,31,000 లు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో అటవీ రేంజ్ అధికారి ఎస్ చంద్రశేఖర్, సిబ్బంది, ప్రొటెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరిని తిరుపతి జిల్లాలో కలపాలి

ప్రజాశక్తి -విజయపురం (నగరి): నగరి, నిండ్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని కోరుతూ అఖిలపక్ష పోరాట సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం ఓం శక్తి గుడి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు పట్టణ ప్రజలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో అనుపమకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పోరాట సాదన సమితి నేతలు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాలోను, నగరి, నిండ్ర, విజయపురం మండలాలను చిత్తూరు జిల్లాలోను ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఈ మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలుపుతామని అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో వాగ్దానం చేశారన్నారు. ఆపై మంత్రుల సబ్ కమిటీ విద్యా వైద్య ఆరోగ్యపరంగానూ, రవాణ సౌకర్యం పరంగాను మూడు మండలాలను తిరుపతిలో జిల్లాలో కలపాలని ప్రకటించారన్నారు. ఆ మేరకు తిరుపతి జిల్లాలో మూడు మండలాలను కలపడంలో జాప్యమవుతోందని త్వరగా పూర్తి చేయాలని కోరారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట సాధన సమితి నేతలు కోదండయ్య, బాబు, నిజాం, వేలన్, గోపి, రవి, రాజవేలు, రఫీ, మస్తాన్, కుమారస్వామి, నాగూర్, రాజేంద్ర, భూపతి, గోపాల్, రాజేష్‌పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ప్యాక్స్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగస్తులు యూనియన్ జేఏసీ పిలుపుమేరకు డీసీసీ బ్యాంక్ నగరి బ్రాంచ్ పరిధిలోని నగరి, కోసలనగరం, అగరం రామకృష్ణ, నిండ్ర ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం (ప్యాక్స్) ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. డిమాండ్లు పరిష్కరించాలని మేనేజర్‌ను కోరారు. ఉద్యోగస్తుల సమస్యల పరిస్కారనికి తమ వంతు సహాయ సహకారం అందిస్తునట్లు బ్యాంకు మేనేజర్ రోజా, అసిస్టెంట్ మేనేజర్ ఆనంద్, సూపర్వైజర్ శ్రీకాంత్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు తులసి పిళ్ళై, రాష్ట్ర నాయకులు ఎ. సుబ్రమణ్యం, నింద్ర సీఈఓ ఎం. సురేష్ బాబు, ఉద్యోగస్తులు కృష్ణమూర్తి, రాధా, కార్తీక్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

11న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పర్యటన

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్లలో సోమవారం జరిగిన వైఎస్ఆర్‌సిపి కార్యకర్తల సమావేశంలో ఎంపీపీ చిచిలి పురుషోత్తం రెడ్డి, జడ్పిటిసి రెడ్డీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ గురువారం మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రొంపిచర్ల మండలంలో పర్యటించనున్న సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. గానుగ చింత, మోటు మల్లెల, పెద్దమల్లెల, చిచ్చులు వారి పల్లి, చంచం రెడ్డి గారి పల్లి, పెద్ద గొట్టిగల్లు, బొమ్మయ్య గారి పల్లె, చల్లవారిపల్లి, రొంపిచర్ల, బండ కింద పల్లి గ్రామాలలోని 43 మంది వైయస్సార్సీపి కుటుంబాలను పరామర్శిస్తున్నారని తెలిపారు. వైసీపీ కార్యకర్తల కష్టసుఖాలను తెలుసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, వైసిపి కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు చెంచు రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ శేఖర్, కరీముల్లా, కోట వెంకటరమణ, సూర్యనారాయణ రెడ్డి, శ్రీనాథ నాయుడు, రవీంద్ర, ఎర్రం రెడ్డి పాల్గొన్నారు.

అధికారులే అన్యాయం చేశారు..!

పట్టుగూళ్ల రైతుల నిరసన

ప్రజాశక్తి -పలమనేరు: 'అధికారులే మాకు అన్యాయం చేశారు..' అంటూ చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలోని సిల్క్ ఫారం వద్ద పట్టుగూళ్ల రైతులు సోమవారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డంగా కూర్చుని సెరి కల్చర్ అధికారులు డౌన్..డౌన్..' అంటూ నిరసనకు దిగారు. సెరికల్చర్ అధికారులు వ్యాపారస్తులతో కుమ్మక్కై కమీషన్లకు అలవాటు పడి రైతులకు గిట్టుబాటు ధర లేకుండా అన్యాయం చేస్తున్నారంటూ తెలిపారు. సోమవారం సెరికల్చర్ ఆఫీసుకు దాదాపు 110 స్లాట్లలో పట్టుగూళ్లను విక్రయానికి తీసుకొని రాగా, వ్యాపారస్తులందరూ సిండికేట్ అయి అతి తక్కువ రేటుకు కొనుగోలు చేసే విధంగా ప్రయత్నిస్తున్నారని కేవలం టాప్ రేట్ 6 పది రూపాయలు మాత్రమే ఖరారు చేశారని. అదే సిల్క్ ఫారం బయట ప్రైవేట్ వ్యక్తులు 730 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని కర్ణాటక కోలార్ 816 రూపాయల వరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. అయితే ఇక్కడ అధికారులను నలదీయగా తమకేమీ తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని పట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయానికి పలమనేరు అర్బన్ ఎస్ఐ లోకేష్ రెడ్డి వచ్చి సర్ది చెప్పడంతో రోడ్డుపై నుండి తమ నిరసన విరమించారు.


నిరసన వ్యక్తం చేస్తున్న పట్టుగూళ్ల రైతులు


నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ పరపతి సంఘం ఉద్యోగులు

నిబంధనలు నిల్!

తొలగని ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరులో పోలీసులు ఎన్నిసార్లు చెప్పినా కొద్దిమంది వాహన దారులు వినకపోవడంతో మిగిలిన వారికి ట్రాఫిక్ ఇబ్బందులు తప్పటం లేదు. పలమనేరులో రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలం అవుతోంది. అసలే ఇరుకు అయిన రోడ్లు, పెరుగుతున్న జనాభాతో ట్రాఫిక్ సమస్య తీవ్ర స్థాయిలో పెరుగుతోంది. దీనికి తోడు పగటిపూట వ్యాపారులు సరుకుల అన్లోడింగ్ కోసం వచ్చే భారీ వాహనాలు రోడ్లపైనే ఆపేస్తున్నారు. పోలీసులు వ్యాపారులకు రాత్రి వేళల్లో మాత్రమే ఆన్లోడింగ్ చేసుకోవాలని చెప్పినా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా బాలాజీ సూపర్ బజార్ ముందర, బజారు వీధి, జవిళి వీధుల్లో భారీ వాహనాలు రోడ్డుపైనే నిలిపి సరుకులు అన్లోడింగ్ చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కనుక వ్యాపారులు అర్థం చేసుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా సహకరించాలని కోరుతున్నారు.


ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహన దారులు

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి..

ప్రజాశక్తి -సోమల: తమ న్యాయమైన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాలైన సోమల, సదుం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయాల వద్ద ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించి పైస్థాయి అధికారులకు మెమొరాండాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సోమల, సదుం సీఈవోలు రెడ్డప్ప, రమణ మాట్లాడుతూ జీవో నెంబర్ 36 వెంటనే అమలు చేయాలని 2019– 2024 పెండింగ్ వేతన సవరణలు చేసి మధ్యంతర భృతి ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాల కు పెంచాలని, ఐదు లక్షలకు పైగా ఆరోగ్య భీమా అందించాలని, 2019 తర్వాత ఉద్యోగంలో జాయిన్ అయిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఇంకా మొత్తం 12 డిమాండ్లపై రాష్ట్ర జేఏసీ ప్రభుత్వానికి వినతి పత్రం అందజేసిందని వెంటనే డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చౌడేపల్లి, సదుం సహకార బ్యాంకు వద్ద సహకార బ్యాంకు వద్ద ధర్నా చేసి మెమోరాండం సమర్పించామని తెలిపారు. కార్యక్రమంలో సహచర ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన లోపం

ఆర్‌టిసి బస్సు ప్రయాణికులకు కష్టాలు

ప్రజాశక్తి-పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు నుండి చిత్తూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సులు సరైన సమయం పాటించకపోవడం వల్ల చిత్తూరు వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల 45 నిమిషాల నుండి 6 గంటల20 నిమిషాల మధ్యలో చిత్తూరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు కనీసం ఒక్కటి కూడా రాలేదు. సాయంత్రం ఆరు గంటల 20 నిమిషాలకు ఒకేసారి ఐదు బస్సులు ఆర్టీసీ బస్టాండ్లకు వచ్చి ప్లాట్‌ఫాంపై ఆగడంతో కోపోద్రిక్తులైన ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంలో బస్టాండ్‌లో ఆర్టీసీ ఇన్‌ఛార్జి యువరాజు నాయుడు ప్రయాణికులకు సర్ది చెప్పారు. ఇదే విషయమై యువరాజ నాయుడును వివరణ కోరగా, ప్రయాణికులు తమ సిబ్బందిపై వాగ్వాదానికి దిగడం, ఫిర్యాదు చేయడం వాస్తవమేనని, ఆర్టీసీకి అనుబంధంగా వున్న హైర్ బస్సులు సమయపాలన పాటించకపోవడం వల్ల ఈ ఇబ్బంది కలుగుతోందని, డిపో మేనేజర్ కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

టిడిపిలో వైసీపీ నాయకుల చేరిక



ప్రజాశక్తి -కుప్పం: సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో టిడిపికి వలసలు మొదలయ్యాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వైసీపీ శ్రేణులు టిడిపిలో చేరేందుకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే వందలాదిమంది వైసీపీ శ్రేణులు టిడిపిలో చేరగా తాజాగా సోమవారం కుప్పం మున్సిపాలిటీ ఒకటో వార్డు కొట్టాలు గ్రామానికి చెందిన 25 మంది వైసీపీ శ్రేణులు తమ కుటుంబాలతో కలిసి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ నుండి టిడిపిలో చేరిన వారికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పార్టీ కండువాతో స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో కుప్పం నియోజకవర్గ అభివృద్ధి పరుగులు తీస్తోందని అభివృద్ధిలో తాము భాగస్వాములు కావాలని టిడిపిలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ రోహిత్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా మణి, వినోద్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -కుప్పం: రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌లుగా కుప్పం మండలం చెక్కు నత్తంకు చెందిన మణి, కుప్పం మున్సిపాలిటీ కత్తి మానుపల్లి కి చెందిన వినోద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో మొదటి ఆర్ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇద్దరూ బాధ్యతలు స్వీకరించగా టిడిపి నాయకులు వారిని ఘనంగా సత్కరించారు. తెలుగు యువత కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడిగా, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేసిన మణి కి రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించారు. అదేవిధంగా ఐటిడిపిలో పనిచేసిన వినోద్‌కు డైరెక్టరుగా అవకాశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, రామకుప్పం మండల అధ్యక్షుడు వెంకటముని, యువత అధ్యక్షుడు కనకరాజు సుబ్బు, వల్లేప్ప, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

వైఎస్ఆర్‌టిఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా ఎన్ సోమచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పలమనేరు: వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా పలమనేరు పట్టణానికి చెందిన ఎన్ సోమచంద్రారెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే అనేక విభాగాలకు అనేక హోదాలలో నియమించిన పార్టీ తాజాగా ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షులుగా సోమచంద్రారెడ్డిని, పలమనేరు నియోజక వర్గం ఉపాధ్యాయ విభాగం అధ్యక్షులుగా బి.గోవిందరెడ్డిని, ఉద్యోగ, పెన్షనర్‌ల విభాగం అధ్యక్షులుగా కె నాగభూషణం లను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ తమపై నమ్మకం ఈ పదవులలో నియమించిన రాష్ట్ర పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, పలమనేరు ఇన్‌చార్జ్ వెంకటేగౌడలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్‌ల సమస్యలు పరిష్కారం కోసం జరిగే పోరాటాలలో భాగస్వాములవుతామన్నారు. విద్యారంగం అస్త వ్యస్తంగా తయారయ్యిందని, ఉపాధ్యాయులు పెన్షనర్ లు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించాలని సూచించారు. చరిత్రలో ఎప్పుడూలేని విధంగా ఒకటిన్నర సంవత్సరాలుగా గ్రాట్యుటీ చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


సోమచంద్రారెడ్డి


కె నాగభూషణం


బి గోవిందరెడ్డి